ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
ఆదివారం 3 మార్చి 2024



నగరంలోని 9 నియోజకవర్గాలకు రూ.225 కోట్ల నిధులు

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పరిధిలో 9 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ప్రత్యేక నిధులు కేటాయించారు. రెండు రోజులక్రి తం మంత్రివర్గ సమావేశంలో తీర్మానించారు. నగర పరిధిలోని మంత్రులు మి నహా మిగిలిన 9 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల అభివృద్ధి కోసం తలా రూ.25 కోట్లు చొప్పున కేటాయించారు. వీరిలో శివాజినగర్, విజయనగర, గోవిందరాజనగర, పులకేశినగర్, శాంతినగరతోపాటు ఇతర నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం రూ.225 కోట్ల గ్రాంట్లు మంజూరు చేశారు. నగర పరిధిలో అత్యవసర పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించినట్టు సీఎం సిద్దరామయ్య ప్రకటించారు.



దర్యాప్తు ముమ్మరం

- పేలుళ్ల బాధితులకు సీఎం పరామర్శ
- సీసీ కెమెరాల్లో అనుమానితుడి దృశ్యాలు
- మంగళూరు పేలుడు తరహాలోనే : డీసీఎం
- ఎన్ఐఏతో దర్యాప్తు జరిపించాలి : కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్లకు సంబంధించి దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం మధ్యాహ్నం బాంబు పేలుళ్లు చోటు చేసుకోగా బెంగళూరు నగర పోలీసులతోపాటు ఎన్ఐఏ బృందాలు రంగంలోకి ప్రవేశించాయి. ఫోరెన్సిక్ నిపుణులు అన్ని కోణాలలోనూ పరిశోధనలు చేస్తున్నారు. బాంబు పేలుడు సూత్రధారిని సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. అతడి ట్రావెల్ హిస్టరీ తెలుసుకునేందుకు వైట్‌ఫీల్డ్‌తోపాటు నగరవ్యాప్తంగా ప్రధానమైన బస్టాండ్లు, రైల్వేస్టేషన్, ఎయిర్‌పోర్ట్ సహా కీలక ప్రాంతాల్లోని 300కు పైగా సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. వైదేహి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న బాధితులను ముఖ్యమంత్రి సిద్దరామయ్య శనివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైదేహిలో చికిత్సలు పొందుతున్న ముగ్గురిలో ఇద్దరిని డిశ్చార్జ్ చేస్తున్నట్టు వైద్యులు సీఎంకు వివరించారు. బ్రూక్‌ఫీల్డ్, మణిపాల్ ఆసుపత్రిలో మిగిలినవారికి చికిత్సలు కొనసాగుతున్నాయి. బాంబు పేలుళ్ల చోటు చేసుకున్న రామేశ్వరం కెఫెను సీఎం పరిశీలించారు.

సీసీ కెమెరాల్లో అనుమానితుడి గుర్తింపు

బాంబు పేలుళ్ల సూత్రధారి కోసం సీసీబీ పోలీసులు తనిఖీలు వేగవంతం చేశారు. నిందితుడు బీఎంటీసీ బస్సులో వచ్చినట్టు గుర్తించిన మేరకు హోటల్‌కు వచ్చి బ్యాగును ఉంచి వెనుతిరిగే సమయంలోనూ బస్సులోనే వెళ్లి ఉంటారనే కోణంలో పరిశీలిస్తున్నారు. వైట్‌ఫీల్డ్ నుంచి మెజస్టిక్, ఎయిర్‌పోర్ట్ వైపు వెళ్లే 28 బస్సుల్లో అమర్చిన సీసీ కెమెరాల ఫుటేజీలను సేకరించారు. ముఖానికి మాస్క్‌తోపాటు కళ్లజోడు, టోపీ ధరించినట్టు నిర్ధారించారు. బ్యాగుతో హోటల్లోకి ప్రవేశించి కౌంటర్‌లో రవ్వ ఇడ్లీ ఆర్డర్ తీసుకుని మొబైల్‌ను పలుమార్లు మాట్లాడేలా నటించినట్టు గుర్తించారు. మరోవైపు ఇదే ప్రాంతంలోని టవర్ ద్వారా 500కు పైగా ఫోన్ నెంబర్లను సేకరించి వాటి ద్వారానూ ఆధారాలను సేకరిస్తున్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే బాంబును ఉంచినట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.





రామేశ్వరం కెఫెలో సీఎం సిద్దరామయ్య పరిశీలన

కెఫెకు ఎన్ఎస్‌జీ కమెండోలు

కెఫెలో బాంబు పేలిన ప్రాంతాలను ఎన్ఎస్‌జీ కమెండోల బృందం కూలంకుషంగా పరిశీలించింది. దర్యాప్తు జరుపుతున్న ఎన్ఐఏ, సీసీబీ పోలీసుల నుంచి సమాచారాన్ని సేకరించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సీసీబీ ద్వారా దర్యాప్తు జరుపుతోంది. ఒకటి రెండు రోజుల్లోనే ఎన్ఐఏకు కేసు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా బెంగళూరుతోపాటు ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. హైదరాబాద్‌తోపాటు వివిధ నగరాలకు పోలీసు అధికారుల బృందాలు చేరాయి.



బాధితురాలిని పరామర్శిస్తున్న సీఎం సిద్దరామయ్య

ఇప్పటివరకు అరెస్టులు లేవు : సీపీ

బాంబు పేలుళ్లకు సంబంధించి ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ స్పష్టం చేశారు. దర్యాప్తు వేగవంతంగా సాగుతోందని, సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలతోపాటు విభిన్న కోణాల్లో పరిశోధనలు సాగుతున్నాయన్నారు. దర్యాప్తును సెంట్రల్ క్రైం బ్రాంచ్ (సీసీబీ)కి అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. హెచ్ఏఎల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును సీసీబీకి అప్పగించామన్నారు.

మంగళూరు పేలుడు తరహాలోనే : డీసీఎం

రామేశ్వరం కెఫెలో పేలుళ్ల సంఘటన మంగళూరులో కుక్కర్ బాంబు పేలుడు, శివమొగ్గ ట్రయల్‌బాంబు బ్లాస్ట్‌కు సారూప్యత ఉన్నట్టు అనుమానాలు ఉన్నాయని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. ఈ కోణంలో పరిశీలనలు సాగుతున్నాయన్నారు. తప్పు చేసినవారు ఎంతటి వారైనా కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

సంఘ విద్రోహులపట్ల సానుభూతి వద్దు : సీఎం

రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్లకు సంబంధించి సంపూర్ణ దర్యాప్తు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదేశించారు. శనివారం సాయంత్రం పోలీసు ఉన్నతాధికారులతో సీఎం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హోంశాఖ మంత్రి పరమేశ్వర్, ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే సహా డీజీపీ, నగర పోలీస్ కమిషనర్, ముఖ్య అధికారులు పాల్గొన్నారు. సంఘ విద్రోహుల పట్ల సానుభూతి వద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిందితుడిని గుర్తించడంతోపాటు వారి వెనుక ఉండే శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఇంటెలిజెన్స్ అప్రమత్తంగా ఉండాలని, తప్పుడు ప్రచారం జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సందర్భాన్నిబట్టి వేగవంతంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో సీఎం ముఖ్యకార్యదర్శి ఎల్‌కే అతీక్, కార్యదర్శి డాక్టర్ త్రిలోక్‌చంద్ర, హోం శాఖ అడిషినల్ సెక్రటరీ ఉమాశంకర్ సహా పలువురు ఉన్నారు.



పేలుడు జరిగిన తీరును సీఎంకు వివరిస్తున్న పోలీసు అధికారులు

ఎన్ఐఏ ద్వారా దర్యాప్తు జరిపించాలి - కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

బాంబు పేలుళ్ల సంఘటనను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని, ఎన్ఐఏ ద్వారా దర్యాప్తునకు ఆదేశించాలని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి డిమాండ్ చేశారు. హుబ్బళ్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యమన్నారు. విధానసౌధలో పాకిస్థాన్‌కు జిందాబాద్ అనే నినాదం జరిగిన రెండు మూడురోజుల్లోనే బాంబు పేలుళ్లు చోటు చేసుకోవడం చూస్తే ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థమవుతోందన్నారు. ఇదో అసమర్థపాలన అన్నారు.

పేలుళ్ల వెనుక భారీ కుట్ర

- వరుస పేలుళ్ల కసరత్తులో భాగమే
- ఎన్ఐఏకు అప్పగించాలి: బీజేపీ డిమాండ్



బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కెఫెలో శుక్రవారం జరిగిన బాంబు పేలుళ్ల ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని, దీన్ని తక్షణం ఎన్ఐఏకు అప్పగించాలని బీజేపీ డిమాండ్ చేసింది. మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై బెంగళూరులో శనివారం మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనను కాంగ్రెస్ ప్రభుత్వం తేలిగ్గా తీసుకుంటే ఉగ్రవాదులకు ఊతమిచ్చినట్టు కాగలదని హెచ్చరించారు. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారని గుర్తు చేశారు. ఘటన వెనుక స్లీపర్‌సెల్ ఉందన్న అనుమానాలు సర్వత్రా వినిపిస్తున్నాయన్నారు. విధానసౌధలో పాకిస్థాన్ జిందాబాద్ నినాదాల అనంతరం జరిగిన ఈ ఘటనను గమనిస్తే అంతర్జాతీయ స్థాయిలో ఏదో జరుగుతోందన్న అనుమానం కలుగుతోందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఈకేసును ఎన్ఐఏకు అప్పగించి ఉండాల్సిందన్నారు.

వరుస పేలుళ్ల కసరత్తులో భాగమే : సీటీ రవి



రాష్ట్రంలో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి మతోన్మాద శక్తులు రెచ్చిపోతున్నాయని బీజేపీ సీనియర్ నేత సీటీ రవి ఆరోపించారు. మంగళూరులో గతంలో జరిగిన కుక్కర్ బాంబు పేలుడు ఘటన, తాజాగా రామేశ్వరం కెఫెలో పేలుళ్లకు సారూప్యం కనిపిస్తోందని స్వయంగా ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్న సంగతిని గుర్తు చేశారు. గత 11 సంవత్సరాల అవధిలో బెంగళూరులో చిన్నా పెద్ద అనేక పేలుళ్లు సంభవించాయని, వీటి వెనుక ఏవో అదృశ్యశక్తులు పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఉగ్రవాదులు కర్ణాటకను సురక్షితంగా భావిస్తున్నారన్నారు. ఉత్తరభారత్‌లో బాంబు పేలుళ్లు పూర్తిగా నిలిచిపోయాయని ఇప్పుడు ఇవి దక్షిణభారత్‌లో అడపాదడపా జరుగుతుండడాన్ని ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఉగ్రవాదుల విషయంలో ఉదాసీనత ఏమాత్రం పనికిరాదన్నారు.

హోంమంత్రి రాజీనామా చేయాలి : అశోక్



విధానసౌధలో పాక్ అనుకూల నినాదాలు, రామేశ్వరం కెఫె బాంబు పేలుళ్ల ఘటనకు నైతిక బాధ్యత వహించి హోం శాఖ మంత్రి పరమేశ్వర్ తక్షణం రాజీనామా చేయాలని శాసనసభలో ప్రతిపక్షనేత ఆర్. అశోక్ డిమాండ్ చేశారు. ఈ రెండు ఘటనల్లోనూ ప్రభుత్వ ఉదాసీనత, బుజ్జగింపు రాజకీయాల పరాకాష్టగా ఉందని ఆరోపించారు.

బోగస్ నివేదిక కోసమే ఆలస్యం : విజయేంద్ర



విధానసౌధలో పాకిస్థాన్ జిందాబాద్ నినాదాల ఘటన జరిగి రోజులు గడుస్తున్నా ఇంతవరకు నిందితులు అరెస్టు కాకపోవడం సిగ్గుచేటు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఆరోపించారు. విధానసౌధ సీసీటీవీ ఫుటేజీలను ఎఫ్ఎస్ఎల్ పరీక్షకు పంపించారని అందులో నినాదాలు నిజమని తేలినా ఇంకా అధికారికంగా ప్రకటించకుండా జాప్యం చేస్తుండడం వెనుక కుట్ర కోణం కనిపిస్తోందన్నారు. ఈ ఘటనను నీరుగార్చేందుకు బోగస్ రిపోర్టు సిద్ధమవుతోందన్న అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ రెండు ఘటనలను ఎన్ఐఏకు అప్పగించాలని అవసరమైతే ఢిల్లీకి వెళ్లి కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు విజ్ఞప్తి చేస్తామన్నారు.

కనుల పండువగా జయమల్లికార్జున స్వామి రథోత్సవం



రథోత్సవంలో మంత్రి నాగేంద్ర

బళ్లారిరూరల్, మార్చి 2 : తాలూకాలోని మోకా గ్రామంలో మోకా జయమల్లికార్జున మహా రథోత్సవాన్ని శనివారం అశేష భక్తుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. మోకా జయ మల్లికార్జున దేవస్థానం నుంచి ఎదురు బసవన్న దేవస్థానం వరకు గ్రామ వీధులలో భక్తుల హరహర నామస్మరణ నడుమ ఉత్సాహంగా సాగింది. బళ్లారి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, మాజీ మంత్రి శ్రీరాములు, కేఆర్‌పీపీ పార్టీ ప్రముఖులు లక్ష్మీ అరుణతో పాటు పలు గ్రామాల ప్రముఖులు, యువకులు, భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. రథోత్సవానికి వీడీహళ్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రుద్రప్ప, రూరల్ సీపీఐలు సతీష్, అయ్యన్నగౌడ పాటిల్, సిందూర్, ఎస్ఐలు కాళింగ, నాగభూషణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు పత్తారు వెంకటేష్, సభ్యులు దేశాయి పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో మోకా మల్లికార్జునస్వామి



నా భార్యను ఎంపీగా చూడాలని ఉంది

- కాంగ్రెస్ టిక్కెట్ ఇస్తే శివమొగ్గ నుంచి పోటీ చేయిస్తాం
- సినీ నటుడు శివరాజ్‌కుమార్



మంత్రితో పాటు శివరాజ్ దంపతులకు స్వాగతం ఇలా

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): 'నా భార్య గీతను శివమొగ్గ ఎంపీగా చూడాలని ఉంది' అని ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇస్తే పోటీ చేయిస్తామని తెలిపారు. శనివారం శివమొగ్గ జిల్లా కల్లహళ్లిలో మంత్రి మధుబంగారప్ప జన్మదిన వేడుకలలో శివరాజ్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గీత ఎంపీ అయితే మహిళా నేతలకు ఆదర్శంగా ఉంటారని తెలిపారు. తాను ఎట్టి పరిస్థితిలోను రాజకీయాలలోకి వచ్చేది లేదన్నారు. తనకు ఆసక్తి లేదని స్పష్టం చేశారు. కష్టం అని వస్తే డబ్బులు ఇచ్చి పంపుతాను కానీ రాజకీయాలు తెలియవన్నారు. బంగారప్ప సుదీర్ఘకాలం రాజకీయాలలో ఉన్నారని, ముఖ్యమంత్రిగా వ్యవహరించారని ఇలా తండ్రి బాటలోనే గీత వెళ్లదలచుకుంటే అభ్యంతరం లేదన్నారు. రాజకీయాలు వారి రక్తంలోనే ఉన్నాయని, ఎంపీగా పోటీ చేసి గెలిస్తే సంతోషిస్తానని అన్నారు. తన తదుపరి సినిమా 'కరటక దమనక' కథ బాగుందని, మరో పేరు పెట్టవచ్చు కానీ కథ కోసం అదే టైటిల్‌ను సిద్ధం చేసుకున్నామన్నారు. మంత్రి మధుబంగారప్పకు స్వయాన సోదరి గీత శివరాజ్‌కుమార్ అనే విషయం తెలిసిందే.

బీజేపీ తొలి జాబితాలో రాష్ట్రానికి దక్కని చోటు

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో బీజేపీ లోక్‌సభకు పోటీ చేసే 195 మంది అభ్యర్థుల తొలి జాబితాను ఢిల్లీలో శనివారం విడుదల చేసింది. ఈ జాబితాలో కర్ణాటక అభ్యర్థులకు చోటు లభించలేదు. జేడీఎస్‌తో పొత్తు దరిమిలా ఇంకా సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతున్న కారణంగానే తొలిజాబితాలో ఎవరి పేర్లు ప్రకటించలేదని తెలుస్తోంది. తొలిజాబితాలోనే తమ పేర్లు ప్రకటిస్తారని ఆశగా ఎదురుచూసిన పలువురు బీజేపీ సిట్టింగ్ ఎంపీలు నిరాశకు గురయ్యారు. కాగా గతంలో కర్ణాటక నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న రాజీవ్‌చంద్రశేఖర్ తాజాగా కేరళలోని తిరువనంతపురం నుంచి పోటీ చేయనున్నారు. ఆయన పేరు తొలిజాబితాలోనే రావడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర శనివారం ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

బడి రుణం తీర్చుకున్న సీఎం


- రెండు పాఠశాలలకు రూ.10 లక్షల చొప్పున విరాళం



బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య తాను ప్రాథమిక విద్యను అభ్యసించిన మైసూరులోని కుప్పెగాల, సిద్ధరామనహుండి పాఠశాలల అభివృద్ధికి తలా రూ.10 లక్షల సాయం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం 'నా పాఠశాల నా బాధ్యత' అనే వినూత్న పథకాన్ని ప్రకటించిన సంగతి విదితమే. ఈ పథకంలో భాగంగా తాము విద్యను అభ్యసించిన పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎవరైనా సరే ఈ మేరకు బాధ్యతలను స్వీకరించే వెసులు బాటుకల్పించారు. ఈ పథకానికి తొలుత ముఖ్యమంత్రే తనవంతు విరాళం ప్రకటించారు. ఈ వినూత్న పథకాన్ని బెంగళూరు నగరంలో ఈ నెల 7న లాంఛనంగా ప్రారంభించనున్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సకల మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దేందుకుగాను ఈ పథకాన్ని ఉద్దేశించారు. కాగా ఈ వినూత్న పథకానికి తొలుత తానే విరాళం ప్రకటించి ముఖ్యమంత్రి ఎందరికో స్ఫూరిదాయకం కావడం సంతోషంగా ఉందని విద్యాశాఖ ఉన్నతాధికారి హెచ్‌కే పాండు నగరంలో శనివారం మీడియాకు చెప్పారు.

పదేళ్ల ప్రాయం వరకు పాఠశాలకు వెళ్లని సిద్దూ

ముఖ్యమంత్రి సిద్దరామయ్య తనకు పదేళ్ల ప్రాయం వచ్చేంతవరకు పాఠశాల ముఖం చూడకపోవడం విశేషం. సిద్దరామయ్య నివసించిన మైసూరులోని సిద్ధరామనహుండి నుంచి 1.5 కిమీ దూరంలో ఉన్న కుప్పేగాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆయన నేరుగా 5వ తరగతిలో అడ్మిషన్ తీసుకున్నారు. 7వ తరగతి వరకు ఇదే పాఠశాలలో చదువుకున్నారు. 2015-16లో ఈ పాఠశాలకు ఆయన ఎకరా భూమిలో 8 గదులు, రెండు మరుగుదొడ్లు నిర్మించారు. అనంతరం పాఠశాల కాంపౌండ్ నిర్మాణానికి తోడ్పాటునందించారు. సీఎం తాజాగా ఈ పాఠశాలకు అందించిన రూ.10 లక్షల సాయంతో స్మార్ట్‌క్లాస్‌ను ఏర్పాటు చేయనున్నట్టు పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రవి మీడియాకు చెప్పారు. విద్యార్థుల కోసం కొత్త కుర్చీలు, టేబుళ్లతో పాటు స్మార్ట్ టీవీ, ప్రొజెక్టర్‌లను కొనుగోలు చేస్తామన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.54	1,604.53
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	886	8,082
సామర్థ్యం (టీఎంసీలు)	8.38	27.97

కనకగిరి ఉత్సవాలను ప్రారంభించిన సీఎం



ఉత్సవాలను ప్రారంభించిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

గంగావతి రూరల్, బళ్లారి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా కనకగిరిలో కనకగిరి ఉత్సవాలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శనివారం రాజా ఉడయప్ప వేదికపై నుండి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాచీన కాలం నుండి కనకగిరి ఉత్సవాలు జరుపుకోవడం సంతోషకరం అన్నారు. కళలు, సాంస్కృతిక, సాహిత్యం, నృత్యం లాంటి కళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు వినోదాలు అందించడంతో పాటు పూర్వకాలం నుండి వస్తున్న జాతరలను జరపడం వల్ల ప్రజలు మరింత ఆనందిస్తారని సీఎం పేర్కొన్నారు. సీఎంతో పాటు కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడిగే, కరడీ సంగణ్ణ, ఎమ్మెల్యే రాఘవేంద్ర యత్నాల్, గంగావతి ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి, ఇక్బాల్ అన్సారీ,దొడ్డనగౌడ పాటీల్ తదితరులు ఉన్నారు.

చిన్నతరహా పరిశ్రమలకు స్వావలంబనే కీలకం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ సీఈఓ రాహుల్

బళ్లారి సిటీ,మార్చి 02: భారత ఆర్థిక వ్యవస్థను రూపొందించడంలో సూక్ష్మ, చిన్న మధ్యతరహా సంస్థలు(ఎంఎస్ఎంఇ) కీలక పాత్ర పోషిస్తున్నాయని, బళ్లారి జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాహుల్ శరణప్ప అభిప్రాయ పడ్డారు. సిడ్బి, పరిశ్రమలు వాణిజ్య శాఖ, జిల్లా పరిశ్రమల కేంద్రం, కాసియా సంయుక్తంగా స్థానికంగా ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో సూక్ష్మ, మధ్య, చిన్నతరహా పరిశ్రమలకు ఎక్కువ ప్రోత్సాహం అందుతోందన్నారు. జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మహారుద్ర గౌడ మాట్లాడుతూ ఎంఎస్ఎంఇ లాంటి జనజాగృతి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పరిశ్రమలకు సంజీవినిగా మారనుందన్నారు. అనంతరం సంస్థ ఉపాధ్యక్షులు యశవంతరాజ్ నాగిరెడ్డి మాట్లాడుతూ సంక్లిష్ట స్థితిలో ఉన్న పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం, పన్ను మినహాయింపు, సబ్సిడీ తదితర అంశాలకు సంబంధించిన సంపూర్ణ సమాచారం ఇలాంటి కార్యక్రమాల ద్వారా పరిశ్రమల దారులు తెలుసుకోవచ్చన్నారు.

ఊపందుకున్న బీజేపీ ఇంటింటి ప్రచారం



18వ వార్డులో బీజేపీ కార్యకర్తల ప్రచారం

సిరుగుప్ప, మార్చి 2 : సిరుగుప్ప పట్టణంలో బీజేపీ పార్టీ కార్యకర్తల ఇంటింటి ప్రచారం ఊపందుకుంది. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండటంతో మూడవ సారి అధికార పగ్గాలు చేపట్టడం కోసం కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ బీజేపీకి మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరుతున్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ దేశ భవిష్యత్తు కోసం ఎన్నో పనులు చేశారని ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా 18వ వార్డు కౌన్సిలర్ మహదేవ, బీజేపీ కార్యకర్తలు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవాలి

బళ్లారి సిటీ, మార్చి 2: రాజ్యాంగాన్ని అందరూ అర్థం చేసుకోవాలని మహాబలేశ్వరప్ప ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ టి.హనుమంతరెడ్డి అన్నారు. రాజ్యాంగంవల్లనే బలహీనులకు హక్కులు వచ్చాయన్నారు. ఆ కళాశాల హాల్లో రాజ్యాంగంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం చాలా ముఖ్యమైనదని, ప్రతి ఒక్కరూ దానిని గౌరవించాలని, దాని విలువ, ఆకాంక్షలను తెలుసుకోవాలని కోరారు. చివరగా అందరితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.

ఖాదర్ బాషా తాత దర్గా సందర్శన

సిరుగుప్ప, మార్చి 2: సిందనూరు తాలుకా తుంగభద్ర నది తీరాన వెలసిన గడ్డె ఖాదర్ బాషా తాత దర్గాను ఈద్ మిలాద్ కమిటీ సభ్యులు శనివారం దర్శించుకుని తాత వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ యేడాది పుష్కలంగా వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని కోరారు. ఈ సందర్భంగా మహమ్మద్ నౌషద్ అలీ, నజీర్, తదితరులు పాల్గొన్నారు.



దర్గాను దర్శించుకుంటున్న కమిటీ సభ్యులు

కంప్లి పురసభలో మామూళ్ల బెడద



ఎన్ని రోజులు గడిచినా ఫారమ్-3 ఇవ్వలేదంటున్న మాజీ కౌన్సిలర్ జీజీ చంద్రణ్ణ

కంప్లి, మార్చి 2 : కంప్లి పురసభలో పనులు జరగాలంటే సంవత్సరాల పొడవునా కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పురసభ మాజీ కౌన్సిలర్ జీజీ చంద్రణ్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తాము సర్వే నెంబర్ 1320లోని 17.50 ఎకరాలలో లేఔట్‌ను ఏర్పాటుచేసి అందులో 260కు పైగా ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. కానీ అధికారులు తమకు కావల్సిన వారికే ఫారమ్-3 ఇస్తున్నారన్నారు. 247ప్లాట్ నెంబర్ వారికి ఫారమ్-3 ఇచ్చి, ప్లాట్ నెంబర్ 168 వారు అన్ని ఆధారాలు సమర్పించినా ఇవ్వకుండా నెలల పాటు తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందిపై ముఖ్య అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అంబేద్కర్ సర్కిల్‌లో హోస్పేట వెళ్లే ప్రయాణికులకు మినీ బస్టాండు ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు ఇచ్చి నిరసన చేపట్టామని, అయినా ఇంతవరకు ఏ అధికారులు పట్టించుకోలేదన్నారు. విలేకరుల సమావేశంలో కడేకల్ మనోహర్, బి నాగేంద్ర, వెంకటరమణ, హనుమంతు, వెంకటేష్, విరుపాక్షి, సుబ్రహ్మణ్యం, రాజా, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని పత్రాలు సమర్పిస్తే ఫారమ్-3 వెంటనే ఇస్తాం

ఫారమ్-3 విషయంపై ముఖ్య అధికారి దుర్గన్నను విచారించగా ఫారమ్-3కు సంబంధించి అన్ని పత్రాలు సంబంధిత సిబ్బందికి ఇచ్చి, దానికి సంబంధించి ప్రభుత్వ సుంకం చెల్లించినట్లయితే వెంటనే ఫారమ్-3 ఇస్తామన్నారు. మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా నేరుగా సమస్యలను అధికారులకు తెలియజేసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. అంబేద్కర్ సర్కిల్‌లో మినీ బస్టాండు విషయంపైన ఇప్పటికే పై అధికారులకు తెలియజేశామని మరోసారి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

బుడా అధ్యక్షుడు జేఎస్ ఆంజనేయులుకు సన్మానం



జేఎస్ ఆంజనేయులను సన్మానిస్తున్న తుంగభద్ర కల్చరల్ అసోషియేషన్

బళ్లారి సిటీ, మార్చి 02: బళ్లారి బుడా చైర్మన్‌గా రెండవ సారి ఎన్నికై బాధ్యతలు చేపట్టిన జేఎస్.ఆంజనేయులును తుంగభద్ర సోషియల్ అండ్ కల్చరల్ అసోషియేషన్ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కేటేశ్వరరావు ,కార్యదర్శి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ జేఎస్.ఆంజనేయులు రెండవ సారి బుడా చైర్మన్‌గా ఎన్నికవడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఆయనసేవలను గుర్తించిన అధిష్టానం బుడా చైర్మన్ పదవి నిచ్చి గౌరవించిందని, అందరికీ అందుబాటులో ఉంటూ బళ్లారిని సర్వాంగ సుందర ంగా తీర్చిదిద్దాలని, నగరంలో నెలకొన్న సమస్యల పట్ల చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా తుంగభద్ర సోషియల్ అండ్ కల్చరల్ అసోషియేషన్ సభ్యులు ప్రసాద్, సత్యబాబు, చిట్టిబాబు, శ్రీనివాస్‌రావు కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నందా పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పాఠశాల అధ్యక్షులు గాంధీ

బళ్లారి సిటీ, మార్చి 2: నగరంలోని శ్రీ నందా పాఠశాలలో శనివారం ప్రాథమిక విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. నగరంలోని విద్యానగర్ 4వక్రాస్‌లో ఉన్న శ్రీనందా రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల అధ్యక్షులు గాంధీ ప్రారంభించి మాట్లాడారు. చిన్నారులకు బాల్యం నుంచి మంచి నడత, ఆదర్శ గుణాలు నేర్పితే కాలానికి అనుగుణంగా మంచి నాగరికులుగా పెరుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమణకుమార్, ఉపాధ్యక్షులు మురళికృష్ణ, ముఖ్యోపాధ్యాయిని శ్రీమతి పార్వతి, లక్ష్మికాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పట్టా పొందడంతోనే విద్యార్థి దశ పూర్తి కాదు

కేఎల్ఈ ఇంజనీరింగ్ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ బసవరాజు ఎస్ అనామి

బళ్లారి గాంధీనగర్, మార్చి 2: డిగ్రీ పట్టా పొందడంతో అధ్యయనానికి ముగింపు పలకరాదని, హుబ్లికి చెందిన కెఎల్ఇ ఇంజనీరింగ్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బసవరాజు ఎస్ అనామి అభిప్రాయ పడ్డారు. వాస్తవంగా పట్టా పొందడం ద్వారా కొత్త జీవనానికి ప్రారంభమని నగరానికి చెందిన ఆర్‌వైఎంసి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్ఎంసి కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు అమెరికా లాంటి దేశాల్లో స్థిరపడి ఆర్ఎంసి కళాశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారన్నారు. అనంతరం కళాశాల అధ్యక్షులు ఆర్.రామనగౌడ మాట్లాడుతూ, వంద సంవత్సరాల క్రితం వీరశైవ విద్యావర్ధక సంఘం స్థాపించి సామాజికంగా వెనుకబడిన ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు స్థాపించి అక్షర దాసోహం, అన్నదాసోహం ద్వారా జ్ఞానదీపాన్ని వెలిగించడానికి మన పెద్దలు చేసిన కృషి ఎనలేనిదన్నారు. వీరశైవ విద్యావర్ధక సంఘానికి వంద ఎకరాలు స్థలం దానం చేసిన రావ్ బహద్దూర్ వై. మహాబళేశ్వరప్ప సేవలు ఎనలేనివని, అందుకుగాను ఆయన జ్ఞాపకార్థకంగా ఆయన పేరుతోనే నేడు ఇంజనీరింగ్ కళాశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గుగ్గిరట్టి రైల్వే ట్రాక్ వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు




బెంగళూరు బైపాస్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

బళ్లారిరూరల్, మార్చి 2 : బళ్లారి నగరంలో బెంగళూరు బైపాస్ గుగ్గిరట్టి రైల్వే ట్రాక్ వద్ద పలు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయడంతో శుక్రవారం గుగ్గిరట్టి రైల్వే గేటు, అలిపిరి మఠం తదితర కూడళ్లలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్న కూడళ్లు, ప్రాంతాల్లో రోడ్ల మరమ్మత్తులతో పాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ తీగలు తగిలి మిరపలోడు దగ్ధం



మంటల్లో మిరపకాయల లారీ



కాలిపోయిన మిర్చి గోతాలు

కంప్లి, మార్చి 2 : కురుగోడు తాలుకా పరిధిలోని సిద్దమ్మనహళ్లి, ఎర్రంగళి గ్రామాల మధ్య విద్యుత్ తీగలు తగిలి మిరప లోడుతో వెళుతున్న ఓ లారీ దగ్ధమైంది. సిద్దమ్మనహళ్లి గ్రామానికి చెందిన మౌనేష్, రాజన్న అనే రైతులు తమ మిరప పంటను 390 సంచుల్లో నింపి కోల్డ్ స్టోరేజీలో వుంచేందుకు బళ్లారికి లారీలో తరలిస్తుండగా ఎర్రంగళి వద్ద లారీకి విద్యుత్ తీగలు తగిలి ఒక్కసారిగా మంటలు ఏర్పడ్డాయి. వెంటనే గమనించిన రైతులు, స్థానికులు మంటలను ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మంటలను చూసి డ్రైవర్ పరుగులు తీశాడు. వెంటనే కురుగోడు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా అగ్నిమాపకదళాలు చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ప్రమాదంలో సుమారు రూ. 15 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై కుడితిని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పండించిన పంట కళ్లెదుటే దాదాపు 90 క్వింటాళ్లు కాలిపోయి బూడిదకావడంతో రైతుల దుఃఖానికి అంతులేకుండాపోయింది.

నాలుగేళ్ల డిగ్రీని ఉపసంహరించుకోవాలి: ఏఐడీఎస్ఓ



జిల్లాకలెక్టర్ కార్యాలయం ముందు ఏఐడీఎస్ఓ నిరసన

బళ్లారి సిటీ, మార్చి 2: నాలుగేళ్ల డిగ్రీని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లాకలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐడీఎస్ఓ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. నిరసనను ఉద్దేశించి ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు కే.ఈరన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎలాంటి సన్నదత లేకుండానే హడావుడిగా ఎన్ఈపీ-2020 ని అమలు చేసిందని, అందులో భాగంగా నాలుగేళ్ల డిగ్రీని సృష్టించిందన్నారు. ఎన్ఈపీ -2020 కి వ్యతిరేకంగా రాష్ట్ర నలుమూలల నుంచి 35వేల మందికి పైగా విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుండి 36లక్షల సంతకాలను సేకరించారని తెలిపారు. ఏఐడీఎస్ఓ బళ్లారి జిల్లా కార్యదర్శి కంబళి మంజునాథ్ మాట్లాడుతూ.... అపూర్వపోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర విద్యా విధానాన్ని రూపొందించేందుకు కమిటీని ఏర్పాటు ఏర్పాటు చేసిందన్నారు. దీనిపై ఏఐడీఎస్ఓ విద్యార్థి సంస్థ ఒక సర్వేనిర్వహించిందని, ఆ సర్వేలో 83శాతం మంది విద్యార్థులు తమకు నాలుగేళ్ల డిగ్రీ అక్కర్లేదని చెప్పారన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర విద్యా కమిషన్ మాత్రం ఆగస్టులో రాష్ట్ర విద్యా విధానంపై తుది నివేదిక ఇస్తామని చెప్పడం ఆందోళన కలిగిస్తోందన్నారు. 5వ సెమిస్టర్ చివరిలో గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మరో సంవత్సరం చదవాలా? వద్దా అనే విషయంలో స్పష్టత ఇవ్వలేదన్నారు. ఇంకో 3, 4 నెలల్లో థర్డ్ ఇయర్ గ్రాడ్యుయేషన్ ముగియనుండడంతో భవిష్యత్తు అనిశ్చితంగా మారిందన్నారు. నిరసన కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షులు ఉమా, ఉపాధ్యక్షులు ఎం.శాంతి, ప్రమోద్, అనుపమ, సతీశ్, హొన్నూర్ స్వామి, సిటీ కళాశాల , సరళా దేవి కళాశాల వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేయించండి

కంప్లి, మార్చి 2 : ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించి రానున్న కాలంలో అనారోగ్యం పాలు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలని ఎమ్మిగనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిరీక్షణ అధికారి క్రిష్ణమూర్తి తెలిపారు. ఎమ్మిగనూరు గ్రామంలో శతమాన పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామంలో పల్స్ పోలియోను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత ఆరోగ్య కేంద్రం

బళ్లారిరూరల్, మార్చి 2 : తాలుకాలోని వై కగ్గల్లు గ్రామంలో రక్షక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆర్ రవితేజ, గౌరవాధ్యక్షులు రామ్ ప్రసాద్, అరవ సూర్య ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పేద బడుగు బలహీన వర్గాలకు ఉచితంగా వైద్యం అందించినట్లు తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం రక్షక్ ఫౌండేషన్ అందుబాటులో వుంటుందని వ్యవస్థాపకులు రవితేజ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కావ్యశ్రీ, షమీర్, మంగళగౌరి, మేఘన, శశికిరణ్, గ్రామ ప్రముఖులు కరిలింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

నగరంలోని కప్పగల్లు రోడ్డుబ్రహ్మయ్య గుడి సమీపంలో ఉప్పర కులబాంధవుల ఆధ్వర్యంలో భగీరథ శిలామూర్తిని స్థాపించి 41 రోజు కావడంతో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉరుకుంద, ఉప్పర మల్లప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

వరదబాధితులను పట్టించుకోని కేంద్రం

- సీపీఎం నాయకుల మండిపాటు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

హోసూరు, మార్చి 2: చెన్నై, తూత్తుకుడి వరద సమయాల్లో కేంద్రం ఉదారంగా స్పందించలేదని సీపీఎం నాయకులు ధ్వజమెత్తారు. వరదబాధితులకు ఎటువంటి చేయూత ఇవ్వలేదన్నారు. హోసూరు రైల్వే స్టేషన్ సమీపంలోని అగరం మహల్‌లో శనివారం సీపీఎం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ తమిళనాడులో బీజేపీ పార్టీ విఫలమవడం ఖాయమని, వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో డిపాజిట్లు కూడా దక్కేది అనుమానమేనన్నారు. పదేళ్లుగా తమిళనాడుకు బీజేపీ చేసిందేమీ లేదన్నారు. వరదబాధితులకు రూ.31వేల కోట్లు అవసరమని తమిళనాడు ప్రభుత్వం కేంద్రానికి విన్నవించినా, కరువు బృందాలు పర్యటించినా గ్రాంట్లు మాత్రం విడుదల కాలేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. కేంద్రం తీరును ఖండించారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు మాజీ ఎమ్మెల పీ ఢిల్లి బాబు, జిల్లా కార్యదర్శి జి.కె.నంజుండన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇరుదయరాజ్, వీ సామ్రాజ్, వీ గోవిందస్వామి, సి.ప్రకాశ్, కె.మహలింగం కామ్రెడ్ జేమ్స్, ఎంజెలామేరి, హోసూరు యూనియన్ కార్యదర్శి బీ రాజారెడ్డి, హోసూరు మున్సిపల్ కార్యదర్శి సీపీ జయరామన్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే వాహనంపై ఐదుగురు.. రూ.25వేల జరిమానా

హోసూరు(క్రైం), మార్చి 2: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఐదుగురు అబ్బాయిలపై హోసూరు టౌన్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. హోసూరు రాంనగర్ సరస్సు ఒడ్డున ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒకే వాహనంపై ఐదుగురు బాలురు ఎక్కి ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించారు. ఇందుకు ఆ వాహన యజమానికి రూ.25వేల జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష విధించారు. ఈ వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఒక సంవత్సరం పాటు తాత్కాలికంగా రద్దు చేశారు. వాహనంపై ఉన్న వారికి 25 ఏళ్ల వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ రాకుండా చర్యలు తీసుకున్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపిన దృశ్యాలను ఫోటో తీసి పంపితే తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6383291232కు ఫోటోలు పంపాలన్నారు.

సరిహద్దులో ముమ్మర తనిఖీలు

హోసూరు, మార్చి 2: బెంగళూరు నగరం వైట్‌ఫీల్డ్‌లోని రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్ల ఘటన నేపథ్యంలో సరిహద్దులోని అన్ని చెక్‌పోస్టులలో ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. జూజువాడి పోలీసులు వాహనాలను సమగ్రంగా పరిశీలించాకే అనుమతిస్తున్నారు. నిందితుల గాలింపులో భాగంగా సరిహద్దుల్లో తనిఖీలు పెంచారు. అనుమానితులను ప్రశ్నించి ఆరా తీస్తున్నారు. పోలీసుశాఖ ఆదేశాలతో కర్ణాటక నుంచి తమిళనాడుకు వచ్చే అన్ని వాహనాలపై నిఘా పెంచారు.



కారును సోదా చేస్తున్న పోలీసులు

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట: మంత్రి

రాయచూరు, మార్చి 2: రాష్ట్రంలో విద్యావ్యాప్తికి, మెరుగైన వైద్యసేవలందించేందుకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు రాష్ట్ర చిన్ననీటి పారుదల సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి ఎన్.ఎస్.భోసరాజు తెలిపారు. వృత్తితోనే అన్నిరకాల పురోగతి సాధ్యమన్నది తమ ప్రభుత్వ అభిమతమన్నారు. దాంతో పాటు పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం నిబద్దతతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. శనివారం జిల్లాలోని సిరవార తాలూకా అత్తనూరులో పలు అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజలు, శంకుస్థాపనలు నిర్వహించారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి ద్వార అత్తనూరులో రూ.27లక్షలతో నిర్మిస్తున్న అప్పర్ ప్రైమరీ స్కూల్ అదనపు తరగతి గదుల భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అదే విధంగా రూ.10లక్షల అంచనా వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి, జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తాను నిబద్ధతతో కృషి చేస్తున్నట్లు తెలిపారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి ఎన్ఎస్ భోసరాజు


సరిహద్దు సైనికుడికి ఘన స్వాగతం

రాయచూరు, మార్చి 2 : దేశ సరిహద్దులో 21 ఏళ్ల పాటు సుదీర్ఘంగా సేవలందించి విశ్రాంతి కోసంతన స్వంత గ్రామానికి వచ్చిన జిల్లావాసి ఎం.సురేశ్‌కు శనివారం ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా జిల్లాలోని సింధనూరు నగరంలో ఆయనకు స్థానికులు, మాజీ సైనికులు, వివిధ పాఠశాలలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పలువురు శుభాకాంక్షలు తెలిపి గ్రామానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నినాదాలు బ్యాండ్ మేళాల శబ్దాలతో సింధనూరు నగరం సందడిగా మారింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

జమ్‌షెడ్జీ టాటా (జయంతి)




భారత పరిశ్రమ పితామహగా పేరొందిన జమ్‌షెడ్జీ నుసర్వాన్జీ టాటా 1839 మార్చి 3న గుజరాత్ రాష్ట్రం నవరి ప్రాంతంలో జన్మించారు. దేశంలో అతి పెద్ద వ్యాపార సంస్థ టాటా గ్రూప్ సంస్థాపకులు. పారిశ్రామిక ప్రపంచంలో ఎంతగా ప్రభావం చూపారంటే దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఆయనను వన్ మ్యాన్ ప్లానింగ్ కమిషన్‌గా అభివర్ణించారు. పత్తి, దుక్క ఇనుము పరిశ్రమలలో అనేక వ్యాపారాల ద్వారా భారతదేశ వ్యాపార ప్రపంచాన్ని మార్చారు. ఆయన సాధించిన విజయాలలో జంషెడ్‌పూర్‌లోని టాటా ఐరన్ అండ్ స్టీల్ వర్క్స్ సంస్థ ప్రముఖమైనది. ఆ తర్వాత పలు రంగాల్లో సత్తా చాటారు. 1904 మే 19న కన్నుమూశారు.

అలెగ్జాండర్ గ్రాహంబెల్ (జయంతి)



అంతర్జాతీయస్థాయిలో శాస్త్రవేత్తగా, ఇంజనీర్‌గా పేరొందిన అలెగ్జాండర్ గ్రాహంబెల్ 1847 మార్చి 3న స్కాట్లాండ్ దేశంలోని ఎడిన్‌బర్గ్‌లో జన్మించారు. టెలిఫోన్ ఆవిష్కర్తగా ప్రపంచ వ్యాప్తంగా పేరొందారు. అమెరికన్ టెలిఫోన్ అండ్ టెలిగ్రాఫ్ కంపెనీ (ఏటీ అండ్ టీ) సంస్థ సంస్థాపకులలో ఒకరు. యూఎస్ పేటెంట్ ఆఫీస్ నుంచి దేశంలో తొలి ఆవిష్కర్తగా నమోద య్యారు. బధిరుల సమస్యల పరిష్కారానికి వైద్య పరిశోధనలు చేశారు. నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ పత్రికకు పునాదులు వేశారు. పలు పురస్కారాలు అందుకున్నారు. 1922 ఆగస్టు 2న కన్నుమూశారు.

మానవల్లి రామకృష్ణ కవి (జయంతి)



మానవల్లి రామకృష్ణ కవి 1866 మార్చి 3న మద్రాసులో జన్మించారు. సాహిత్య పరిశోధకులు, కవి, సంస్కృతాంధ్ర పండితుడు, బాహుభాషాకోవిదుడు. 16 ఏళ్లకే 'మృగవతి' కవితను రాసి 'కవి' బిరుదును పొందారు. మద్రాసులోని ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోనూ, తర్వాత వనపర్తి సంస్థానంలోనూ అంతరంగిక కార్యదర్శిగా పనిచేశారు. తాళపత్రాలను సేకరించి అభినవ భారతి, కుమార సంభవం వంటి కృతులను వెలుగులోకి తెచ్చారు. 1957 సెప్టెంబరు 21న తిరుపతిలో కన్నుమూశారు.

ఆచంట లక్ష్మీపతి (జయంతి)



డాక్టర్ ఆచంట లక్ష్మీపతి 1880 మార్చి 3న పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో జన్మించారు. కందుకూరి వీరేశలింగం శిష్యులలో ఒకరు. ఆయుర్వేద కళాశాలలో ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. తెలుగులో 'ధన్వంతరి' పత్రికనూ, ఆంగ్లంలో 'ఆంధ్రా మెడికల్ జర్నల్' ను ప్రచురించారు. భారతీయవైద్యంపై 63 పుస్తకాలు రచించారు. మద్రాసులో ఆంధ్రసాహిత్య పరిషత్‌కు కార్యదర్శిగా పనిచేశారు. ఆయుర్వేద వైద్యుడిగానే కాక సంఘసేవకుడిగా, రచయితగా సేవలందించిన ఆయన 1962 ఆగస్టు 6న కన్నుమూశారు.

పండిట్ పుట్టరాజ్ గవాయ్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత పండిట్ పుట్టరాజ్ గవాయ్ 1914 మార్చి 3న హావేరి జిల్లాలోని దేవగిరి ప్రాంతంలో జన్మించారు. గ్వాలియర్ ఘరానా శైలిలో హిందూస్థానీ సంగీతంలో పేరొందారు. వీణ, తబల, మృదంగం, వయోలిన్ వంటి వాటిలో నిష్ణాతులు. భజనల పాటలు ప్రత్యేకం. కన్నడ, సంస్కృత, హిందీ భాషలలో 80కుపైగా వచనాల పుస్తకాలు రాశారు. భగవద్గీతను బ్రెయిలీలో రాసిన ఘనత ఆయనది. దివ్యాంగుల సంక్షేమం కోసం, నాటక రంగంకోసం పాటుపడ్డారు. 2010 సెప్టెంబరు 17న కన్నుమూశారు.

శంకరమంచి సత్యం (జయంతి)



శంకరమంచి సత్యం 1937 మార్చి 3న గుంటూరు జిల్లా అమరావతి గ్రామంలో జన్మించారు. కథా రచయితగా పేరొందారు. తెలుగులో ఆయన రాసిన 'అమరావతి కథలు' ఎంతో ప్రాచుర్యం పొందాయి. 1979లో రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. ఆయన రాసిన 'ది ఫ్లడ్' ఆంగ్లంలోకి అనువాదమైంది. బుల్లితెర దర్శకుడు శ్యామ్‌బెనెగల్ 'అమరావతి కి కథయె' పేరిట ప్రసారం చేశారు. 1987 మే 21న కన్నుమూశారు.

శంకర్ మహదేవన్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత శంకర్ మహదేవన్ 1967 మార్చి 3న ముంబైలో జన్మించారు. దేశంలో పేరొందిన 'శంకర్- ఎహ్సాన్- లోయ్' త్రయం లో గాయకుడు, స్వరకర్త. బాల్యంనుంచే హిందూస్తానీ, కర్ణాటక సంగీతం నేర్చుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కెరీర్ ప్రారంభించి సంగీతంలో రాణించారు. ఉత్తమ గాయకుడిగా పలు అవార్డులు పొందారు. 81 దేశాలలో అకాడమీ ఏర్పాటు చేసి ఔత్సాహికులకు సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు. అంతేకాక సంగీతంతో స్ఫూర్తి చెందేలా సామాజిక చైతన్య కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు.

4న మంథన్ సన్నాహక సమావేశం

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో 16వ ఎడిషన్ మంథన్ కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం సమాఖ్య ప్రాంగణంలో ఈ నెల 4న జరుగనుంది. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖా మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరు కానుండగా గౌరవ అతిథులుగా వాణిజ్య పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ సెల్వకుమార్, కర్ణాటక డిజిటల్ ఎకానమీ మిషన్ చైర్మన్ బీవీ నాయుడు, టిఈఈ అధ్యక్షుడు మదన్ పడకి, సమాఖ్య అధ్యక్షుడు రమేష్ చంద్ర లహోటిలు హాజరు కానున్నట్లు నగరంలో శనివారం విడుదలైన ప్రకటన పేర్కొంది.

పేదల అభ్యున్నతికి ప్రాధాన్యం: డీసీఎం

మహదేవపుర, మార్చి 2: అన్నం, ఆరోగ్యం, అక్షరం, ఆశ్రయం ఇవి తమ ప్రభుత్వ మూలమంత్రాలని, పేదల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. కేఆర్‌పురలో శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీలో పాల్గొని మాట్లాడుతూ మౌలిక సదుపాయాలైన తాగునీరు, ఉద్యోగం కల్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. దేశంలో పేదలకు ఇళ్లు ఇవ్వాలన్న చట్టం తెచ్చింది మాజీ ప్రధాని ఇందిరాగాంధీయేనన్నారు. ఐదు లక్షల ఇళ్లు నిర్మించి పేదలకు ఇవ్వాలని కేబినెట్‌లో వసతి శాఖ మంత్రి జమీర్ ప్రతిపాదనపై తీర్మానించినట్టు తెలిపారు. కాగా రాజీవ్‌గాంధీ వసతి మండలి నుంచి ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ గ్రాంటు మంజూరు కాలేదన్న ప్రజల వినతులపై సానుకూలంగా స్పందించారు. పేదల ఇళ్లపై కూడా కేంద్రం జీఎస్టీ వేసిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. బెంగళూరు నగరంలో మురికివాడలను సైతం అభివృద్ధి చేసేలా ప్రభుత్వం సంకల్పం చేసిందని, ఈసారి బడ్జెట్‌లో పేదలకు ఇళ్లు ఇచ్చే పథకాన్ని కొనసాగించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాలతో కోట్లాదిమంది ప్రజలకు లబ్ధి చేకూరుతోందన్నారు. ఈ సందర్భంగా అక్బర్ - బీర్బల్ కథను ప్రస్తావించారు. మురికివాడల అభివృద్ధి మండలి ప్రసాద్ అబ్బయ్య బాధ్యతలు చేపట్టాక చురుగ్గా కార్యాచరణ కొనసాగిస్తున్నారన్నారు. కొత్తగా గృహ ప్రవేశం చేస్తున్నవారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు డీసీఎంను ఆత్మీయంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.



డీసీఎం శివకుమార్‌తో ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

బీజేపీలోకి కాంగ్రెస్ సీనియర్ నేత



మనోహర్ తహసీల్దార్‌ను స్వాగతిస్తున్న విజయేంద్ర, అశోక్, బొమ్మై

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హావేరి జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత మనోహర్ తహసీల్దార్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బెంగళూరు మల్లేశ్వరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో ఆయనను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మైలు ఆత్మీయంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొమ్మై మాట్లాడుతూ మనోహర్ తహసీల్దార్ చేరికతో హావేరి జిల్లాలో పార్టీకి కొండంత బలం వచ్చిందన్నారు. కొద్దికాలంగా జిల్లాలోని హనగల్ తాలూకాలో ద్వేష రాజకీయాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. బీవై విజయేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్‌లో మరింతమంది నేతలు లోక్‌సభ ఎన్నికల నాటికి బీజేపీలో చేరనున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీకి అనుకూలంగా గాలులు బలంగా వీస్తున్నాయని, రాష్ట్రంలోని మొత్తం 28 లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేపీ ఘన విజయాలు అందుకోవడం తథ్యమన్నారు. మనోహర్ తహసీల్దార్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలకుపైగా కాంగ్రెస్‌లో ఉండి సేవలందించానని పార్టీలో కొద్దికాలంగా తనకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. దేశ అభివృద్ధి, రక్షణ ప్రధాని మోదీతో మాత్రమే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షనేత ఆర్ అశోక్‌తోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

కట్టుకథలు నిలిపేస్తే సమస్యలకు పరిష్కారం

» ఎంఎస్ రక్షారామయ్య

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఊహాజనితమైన కట్టుకథలను నిలిపేస్తే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రక్షారామయ్య పేర్కొన్నారు. చిక్క బళ్లాపురలో స్థానిక క్రీడాకారులు, న్యాయవాదులు, మీడియా, ప్రజా ప్రతినిధులకోసం ఏర్పాటైన క్రికెట్ టోర్నమెంటును ఆయన శనివారం లాంచనంగా ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ సోషల్ మీడియాలో వచ్చే ఊహాజనిత కథనాలు, కల్పిత కథనాల ఉచ్చులో పడవద్దని ఆయన యువతకు విజ్ఞప్తిచేశారు. మండ్యలో ఇటీవల బీజేపీ కార్యకర్త ఒకరు పాకిస్థాన్ జిందాబాద్ అని నినాదాలు చేసినా మీడియాతో సహా ఎవరికీ అభ్యంతరం రాలేదని విధాన సౌధలో నాసిర్ సాబ్ జిందాబాద్ అని నినాదాలు చేస్తే దాన్ని వక్రీకరించి కట్టుకథలు అల్లి ప్రచారం చేస్తున్నారని గతంలో దేశవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు చాలా జరిగాయని ఆయన గుర్తుచేశారు. విధానసౌధ ఘటనపై ఎఫ్ఎస్ఎల్‌లో నిజనిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని ఒకవేళ నిందితులుగా తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని రక్షారామయ్య వెల్లడించారు. గ్యారెంటీ పథకాల కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వ ఇమేజ్ రోజు రోజుకు పెరుగుతుండటాన్ని సహించలేక బీజేపీ ఒక పథకం ప్రకారం దుష్ప్రచారానికి దిగిందని ఆయన ఆరోపించారు. చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణ జిల్లాల్లో కాంగ్రెస్ కార్యకర్తలంతా ఐక్యంగా ఉన్నారని ఎలాంటి సమస్యలు లేవని ఆయన స్పష్టం చేశారు. పార్టీకోసం నిజాయితీగా కష్టపడే కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. కాంగ్రెస్ సముద్రం లాంటిదని ఎవరికీ అన్యాయం జరగదని ఆయన పేర్కొన్నారు. అనంతరం విజేతలకు ఆయన ట్రోఫీలను అందజేసి అభినందించారు.



విజేతలకు ట్రోఫీ అందజేత

రైతులకు మరిన్ని సౌలభ్యాలు కల్పించాలి



వేదికపై ప్రముఖులు

శిడ్లఘట్ట, మార్చి 2: వ్యవసాయంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటున్న రైతులకు ప్రభుత్వం మరిన్ని సౌలభ్యాలు కల్పించడం ద్వారా ఆదుకోవాలని బసవకల్యాణ మఠం మాదేవ స్వామీజీ అభిప్రాయపడ్డారు. పట్టణ శివారులోని కెంపణ్ణ స్వామి వీరణ్ణస్వామి కల్యాణమండపంలో ఏర్పాటైన రైతుల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఎండనక వాననక కష్టపడితేనే పంటలు సాగవుతాయని, ఎన్నికష్టాలు వచ్చినా వారు వ్యవసాయాన్ని వీడడం లేదన్నారు. అటువంటి అన్నదాతల పట్ల చిన్నచూపు చూడకుండా తగిన విధంగా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన లీగల్‌సెల్ మెంబర్ సెక్రటరీ న్యాయమూర్తి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో రైతుల సంఖ్య తగ్గుతోందని, అయినంత మాత్రాన రైతులను నిర్లక్ష్యం చేయకుండా అన్ని విధాలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రైతుసంఘం ప్రధాన కార్యదర్శి భక్తరహళ్లి బైరేగౌడ మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించేలా కార్యక్రమం ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మురుఘా మఠం పాలక కమిటీ చైర్మన్‌గా శివయోగి కలసద

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గలోని మురుఘా మఠం వివాదంపై సుప్రీంకోర్టు మార్గ దర్శకాలకు అనుగుణంగా మురుఘా మఠం ట్రస్టు, ఎస్‌జేఎం విద్యాసంస్థల పాలనా పర్యవేక్షకుల కమిటీ చైర్మన్‌గా మాజీ ఐఏఎస్ అధికారి శివయోగి కలసదను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోక్సో చట్టం కింద కేసులు నమోదైనా మురుఘామఠాధిపతి శివమూర్తి పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదని సుప్రీంకోర్టు స్పష్టంగా సూచించిన సంగతి తెలిసిందే. పాలనా వ్యవహారాలకు మూడు రోజుల్లో కమిటీ ఏర్పాటు చేయాలని ఫిబ్రవరి 27న ప్రభుత్వానికి సుప్రీం ఆదేశించింది. దీంతో మాజీ ఐఏఎస్ అధికారి శివయోగి కళసదను నియమించారు. మఠానికి పాలనాధికారిగా మాజీ ఐఏఎస్ అధికారి పీఎస్ వస్త్రద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీం ధర్మాసనం రద్దు చేసింది.

గౌరిలంకేశ్ హత్యకేసు నిందితుడికి సుప్రీం నోటీసు

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమ కారిణి, పాత్రికేయురాలు గౌరి లంకేశ్ హత్యకేసు నిందితుడు ఎన్ మోహన్‌నాయక్‌కు హైకోర్టు జారీ చేసిన బెయిల్ పిటీషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈమేరకు నిందితుడికి సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం నోటీసులు జారీ చేసింది. కర్ణాటక ప్రభుత్వం తరఫున న్యాయవాది వీఎన్ రఘుపతి పిటీషన్ వేశారు. సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మల ధర్మాసనం నిందితుడి అభిప్రాయాన్ని కోరింది. గౌరిలంకేశ్ సోదరి కవితా లంకేశ్ దాఖలు చేసిన పిటీషన్‌కు అనుగుణంగా జనవరిలో ఆరోపితులకు నోటీసు జారీ అయ్యింది. కవితా తరపున న్యాయవాది అపర్ణాభట్ వాదనలు వినిపించారు. తదుపరి విచారణను ఏప్రిల్ 9కు వాయిదా వేశారు. కాగా నిందితుడు మోహన్‌నాయక్‌కు 2023 డిసెంబరు 7న బెయిల్ మంజూరైంది.

తుపాకీతో కాల్చుకుని యువకుడి ఆత్మహత్య

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కొడగు జిల్లా మడికేరిలో ఛాతీకి తుపాకీతో కాల్చుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మాదాపూర్ సమీపంలోని ముప్పత్తొక్లు గ్రామానికి చెందిన ప్రవీణ్ (28) ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు. సింగిల్‌బ్యారెన్ గన్ నుంచి ఛాతీకి కాల్చుకుని శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన వెంటనే మాదాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని మడికేరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం చేసే ప్రవీణ్ ఇటీవల కొన్ని రోజులక్రితం స్వగ్రామానికి వచ్చినట్టు తెలిసింది.

నిరుపేదల కోసం బెంగళూరులోనూ ఆసుపత్రి నిర్మించండి

బెంగళూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ రజనీకాంత్ చెన్నైలో 12 ఎకరాల్లో నిరుపేదలకు ఉచిత వైద్యసేవలందించేందుకు ఆసుపత్రి ఏర్పాటుకు శ్రీకారం చుట్టడాన్ని కర్ణాటక బహుజన ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. కర్ణాటక సినీపరిశ్రమలోనూ ఎందరో నిరుపేద కళాకారులు, కార్మికులు ఉన్నారని వీరికి ఉచితంగా వైద్యం అందించే దిశలో ఓ ఆసుపత్రి నిర్మాణానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేసింది. సమాఖ్య అధ్యక్షుడు జీహెచ్ శంకర్ ఈ మేరకు శనివారం నగరంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ సోదరుడైన సత్యనారాయణ్ రావ్ గైక్వాడ్‌కు ఒక వినతి పత్రం అందజేశారు. ఇదే సందర్భంగా ఆయనను సన్మానించారు.



రజనీకాంత్ సోదరుడు సత్యనారాయణ రావ్‌ను సన్మానిస్తున్న పదాధికారులు

బీఎస్పీ సన్నాహక సభ

దొమ్మసంద్ర, మార్చి 2: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సన్నాహకసభ నిర్వహించారు. సర్జాపుర బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశానికి పార్టీ కోశాధికారి డాక్టర్ చిన్నప్ప వై చిక్కహాగడె అధ్యక్షత వహించారు. ఈనెల 9న దేవనహళ్ళిలో బెంగళూరు విభాగం సమావేశం జరగనుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మారసంద్ర మునియప్ప, రాష్ట్ర ఇన్‌చార్జ్‌లు కృష్ణమూర్తి, గౌతమ్‌లు పాల్గొంటారన్నారు. ఏ పార్టీలతో పొత్తు లేకుండా పోటీ చేయ దలిచిందన్నారు. తొలుత మాజీ ఐఏఎస్ అధికారి కే శివరాం మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సీఎల్ మునియల్లప్ప, బెంగళూరు ఇల్లా ఇన్‌చార్జ్ గౌరిశంకర్, కుమార ఆచారి, మిథున్ రెడ్డి, తౌసిఫ్ అహ్మద్, ఆటో మునియల్లప్ప, పోలీస్ పాపణ్ణ, బుల్లెట్ కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో బీఎస్పీ పదాధికారులు


మల్పె మత్స్యకారుల కిడ్నాప్

» భట్కళ్‌కు చెందిన ఏడుగురి అరెస్టు

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉడుపి జిల్లా మల్పెకు చెందిన మత్స్యకారులను కిడ్నాప్ చేసి ఏకంగా 8 లక్షలకు పైగా విలువైన చేపలను దోపిడీ చేసిన ఏడుగురి ముఠాను మల్పె పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఫిబ్రవరి 19న మల్పెకు చెందిన చేతన్ సాలియానాకు చెందిన కృష్ణనందన అనే లైలాన్ బోట్‌లో నాగరాజ్ హరికాంత, అరుణ్ హరికాంత అంకోలా, నాగరాజ్ హెచ్ హరికాంత, అశోక్ కుమట, కార్తీక్ హరికాంత మంకీ, చంద్ర కాంత్ హరికాంత్ ఒప్పంద, సుబ్రమణ్య కార్విలు సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. 27న వేటముగించుకుని మల్పెవైపు బోట్‌లో వస్తున్నవేళ బోట్ ఫ్యాన్‌కు వల చిక్కుకోవడంతో సముద్రంలోనే నిలిచిపోయింది. ఇదే సమయంలో 25మంది ఒక్కసారిగా ఇతర బోట్లతో వచ్చి తీరానికి బోట్లు లాగారు. అందులో ఉండే ఏడుగురు మత్స్యకారులను కిడ్నాప్ చేశారు. బోట్‌కు నింపిన 7,500 లీటర్ల డీజిల్‌ను చోరీ చేశారు. ఈ మేరకు మత్స్యకారుల కుటుంబీకులు మల్పె పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు భట్కళ్‌కు వెళ్లి బోటుతోపాటు మత్స్యకారులను గుర్తించారు. కిడ్నాప్‌కు పాల్పడిన ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారిలో సుబ్రమణ్య కార్వి (34), రాఘవేంద్ర కార్వి (38), హరీశ్ నారాయణ (40), గోపాల్ మాధవ్ (38), నాగేశ్ నారాయణ్ (42), భట్కళ్‌కు చెందిన సంతోష్ దేవయ్య (43), లక్ష్మన్ (50)లను అరెస్టు చేశారు. అయితే తమ పరిధిలో చేపలవేట చేశారని, అందుకే దాడి చేసినట్టు అరెస్టు అయినవారు తెలిపారు. మల్పె డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో దాడి జరిపి అరెస్టు చేశారు. నేరాల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, ఎప్పటికప్పుడు దర్యాప్తు చేస్తున్నామని మీడియాకు వివరించారు.

ప్రపంచస్థాయి ఏఐ సెంటర్ ఏర్పాటు

» ఎకనమిక్ ఫోరంతో మంత్రి ఖర్గే ఒప్పందం



ఒప్పందంలో మంత్రి ప్రియాంక ఖర్గే తదితరులు

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం అభివృద్ధి కోసం ప్రపంచస్థాయి సెంటర్‌ను ఏర్పాటు చేయదలిచామని ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గే తెలిపారు. శుక్రవారం ఎకనామిక్ ఫోరం ఎండీ జరిమి జుర్గన్స్‌తో ఒప్పందం చేసుకున్నారు. దేశంలో ఏఐ కోసం ఏర్పాటైన ఏకైక ఫోరం ఇదేనని మంత్రి తెలిపారు. సాంకేతిక విద్య, నైపుణ్యతను సుగమం చేయడంతోపాటు పరిశోధనలు ఉత్తేజపరిచేలా ప్రపంచస్థాయి సమస్యలకు సాంకేతికంగా పరి ష్కరించేలా కేంద్రం పనిచేయనుందన్నారు. కర్ణాటకను కృత్రిమ మేధస్సులో ముందంజలో తీసుకెళ్లేందుకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉండే ఇతర ప్రాంతీయ ఏఐ కేంద్రాలతో సంబంధాలు ఉంటాయన్నారు. విశ్వవ్యాప్తంగా చర్చాగోష్ఠులు జరిపేందుకు అవకాశం ఉంటుందన్నారు.

సీఎంకు పాలనా సంస్కరణల కమిషన్ నివేదిక



సీఎంకు నివేదిక సమర్పణ

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాలనా సంస్కరణల కమి షన్-2 అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి టీఎం విజయ్‌భాస్కర్ శనివారం ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు తన 7వ నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్, ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గే పాల్గొన్నారు. నివేదికను స్వీకరించిన అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ కూలంకుషంగా పరిశీలించిన అనంతరం కేబినెట్‌లో చర్చించి కమిషన్ సిఫారసులపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్ర పాలనా వ్యవహారాలను మరింతగా మెరుగు పరిచే దిశలో కమిషన్ సిఫారసులు దోహద పడ తాయన్నారు. పాలనా వ్యవహారాలలో అనవసర ఖర్చులను తగ్గించు కోవడం తోపాటు సిబ్బంది సేవలను గరిష్ఠస్థాయిలో వినియోగించుకునే దిశలో ఈ సిఫా రసులు ఉపయోగపడనున్నాయని పేర్కొన్నారు. పాలనా సంస్కరణలను మెరుగు పరచడం ద్వారా పారదర్శకతను తీసుకురావడం తమ ఉద్దేశ్యమన్నారు. ఇందులో మొత్తం 39శాఖలకు సంబంధించిన పలు అంశాలపై 5039 సిఫారసులు చేసిందన్నారు.

రేపు వ్యవసాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

» 1244 మందికి పట్టాల ప్రదానం : వీసీ సురేష్



మీడియా సమావేశంలో వీసీ సురేష్ తదితరులు

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గాంధీ కృషి విజ్ఞాన కేంద్రంకు అనుబంధమైన వ్యవ సాయ విశ్వవి ద్యాలయం 58వ స్నాతకోత్సవం సోమ వారం జరు గుతుందని వైస్ చాన్స్‌లర్ ఎస్‌వీ సురేష్ తెలిపారు. శనివారం వీసీతో పాటు రిజి స్ట్రార్‌లు మీడియాతో మాట్లాడుతూ నాలుగేళ్ల వ్యవధి సెమిస్టర్ పద్ధతిలో 6 వృత్తి పర, సాంకేతికమైన కోర్సులు, రెండేళ్ల వ్యవధికి సంబంధించి పోస్టు గ్రాడ్యుయేట్‌లో 35 సబ్జెక్టులలో బెంగళూరు, మండ్య, చింతామణి, హాసన్‌లలో కోర్సులు పూర్తి చేసిన వారికి పట్టాలు ప్రదానం చేయనున్నారు. పీహెచ్‌డీకి సంబంధించి బెంగళూరులో 16 సబ్జెక్టులు, మండ్యలో 3 సబ్జెక్టులకు సంబంధించి 19 కోర్సులు చేసినవారికి పట్టాల ప్రదానం ఉంటుందన్నారు. మొత్తం 1244 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం చేస్తామన్నారు. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీలో 29మందికి బంగారు పతకాలు, మాస్టర్స్‌లో 69మందికి బంగారు పతకాలు, డిగ్రీలో 58మందికి బంగారు పతకాలు ఉంటాయన్నారు. మీడియా సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ బసవేగౌడ, డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ డాక్టర్ కేసీ నారాయణస్వామి ఉన్నారు. సోమవారం స్నాతకోత్సవంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి, కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ పరిశోధనా విభాగం సెక్రటరీ డాక్టర్ హిమాంశు పాఠక్‌లు ముఖ్యులుగా పాల్గొంటారన్నారు.

వినూత్నంగా 'మసీదు దర్శన'



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, ప్రజలు

బాగేపల్లి, మార్చి 2: ప్రజల్లో మసీదులపట్ల ఉన్న అపోహలను దూరం చేసి హిందూ, ముస్లింల మధ్య బాంధవ్యాలను పెంచేలా మసీదు దర్శన కార్యక్రమం శనివారం వినూత్నంగా నిర్వహించారు. ఇదే తొలిసారి ఫారూక్ మసీదు సమితి ఆధ్వర్యంలో చేపట్టారు. మహిళలు, పిల్లలు అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్ మాట్లాడుతూ ప్రజలమధ్య సత్సంబంధాలను పెంచేలా మసీదు దర్శన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఫారూక్ మసీదు అధ్యక్షుడు మునీర్ అహ్మద్ మాట్లాడుతూ మసీదులలో ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహిస్తారు, ఇతర మతాల పట్ల విషబీజం వేస్తారనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. మసీదుకు వచ్చే అతిథులకు గౌరవపూర్వకంగా ధార్మికంగా ప్రోత్సహించేలా పుస్తకాలు ఇస్తామన్నారు. అయితే ఇందుకు వక్రీకరణ చేయరాదన్నారు. పలువురు తమ అభి ప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, మసీదు సమితి ఉపాధ్యక్షుడు వజీర్, మునీర్ అహ్మద్, నూరుల్లా, కరవే తాలూకా అధ్యక్షుడు హరీశ్, పాస్టర్ ప్రకాశ్, డాక్టర్ అశ్వత్థనారాయణస్వామి, కర్ణాటక సంఘం ప్రముఖులు జుబేర్ అహ్మద్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు ల్యాండ్ కాని విమానం

» కలబురగి నుంచి బెంగళూరుకు వాపసు

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి 40 మంది ప్రయాణీకులతో బయల్దేరిన అలయెన్స్ విమానం ఈదురుగాలుల కారణంగా కలబురగి విమానాశ్రయంలో ల్యాండ్ కాలేకపోయింది. విమానంలో రాష్ట్ర మంత్రి శరణబసప్ప దర్శనాపుర, ఎమ్మెల్యే బసవరాజ మత్తిమడు, కేపీసీసీ ప్రధాన కార్యదర్శి శరణ కుమార్ మోదితోపాటు పలువురు ఉన్నారు. గురువారం సాయంత్రం విమానం బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి కలబురగికి బయల్దేరింది. ఈదురుగాలులు తీవ్రంగా ఉండడంతో సేడం వైపు నుంచి ల్యాండింగ్ అయ్యేందుకు ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో మరోసారి ఆకాశంలోకి వెళ్లి రెటకల్‌వైపు నుంచి ల్యాండింగ్‌కు యత్నించారు. రన్‌వేకు 30 అడుగుల సమీపానికి చేరినా ల్యాండింగ్‌కు వీలు కాలేదు. దీంతో పైలట్ అప్రమత్తమయ్యారు. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండింగ్ అయ్యేందుకు అనుమతులు కోరారు. ఆ సమయంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి అనుమతులు రాలేదు. మూడోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించి విఫలం కావడంతో బెంగళూరువైపు మళ్లించారు. రాత్రి 11 గంటలకు బెంగళూరుకు విమానం చేరింది. ప్రయాణికులు ఇతర విమాన సర్వీసుల్లో గమ్యాలకు బయల్దేరారు. కలబురగి విమానాశ్రయంలో యూని వర్సిటీ వైపు నుంచి బ్రహ్మకుమారి సంస్థ మీదుగా విమానాలు ల్యాండ్ అవుతాయి. బ్రహ్మకుమారి సంస్థకు సంబంధించిన ప్రహరీ, కొండ ఉండడంతో రాత్రివేళల్లో ల్యాండింగ్‌కు అనుమతులు ఇవ్వరు. దీంతో సేడంవైపు నుంచి ల్యాండింగ్ చేస్తారు. నైట్ ల్యాండింగ్‌కు తగిన సౌలభ్యాలు కల్పించినా విమానం గమ్యం చేరకపోవడంతో ప్రయాణీకులు ఆందోళన చెందారు. కలబురగి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ చిలకా మహేశ్ స్పందిస్తూ ఈదురుగాలులు తీవ్రంగా ఉన్నందున భద్రతా కారణాలతో పైలట్ విమానాన్ని బెంగళూరుకు మళ్లించారని, ఆలస్యమైనందుకు చింతిస్తున్నామన్నారు.

హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో జోస్ అలుక్కాస్ శాఖ



శాఖ ప్రారంభంలో ప్రముఖులు

బొమ్మనహళ్ళి, మార్చి 2: హెచ్ ఎస్ఆర్ లే అవుట్ 27వ మెయిన్‌రోడ్డులో జోస్ అలుక్కాస్ షోరూంను సినీ నటి షర్మిలాపాండే శనివారం లాంచనంగా ప్రారంభించారు. నగరంలో రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో శాఖను ఏర్పాటు చేసినట్టు సంస్థ అధినేత తెలిపారు. యువత అభిరుచికి అనుగుణంగా నగలు అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.